ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -79 పేజీలు - 05 వెల - 04/- ఆదివారం 29 మార్చి 2026

# అమరావతికి రాజముద్ర

## అమరావతి రాజధాని కోసం ఏకగ్రీవ తీర్మానం ఆమోదం

- ఇక అంగుళం కూడా కదిలించలేరు
- భూములతో పాటు భవిష్యత్తునూ ఇచ్చిన రైతులు
- అందుకే అమరావతి మన శాశ్వత రాజధాని
- స్వీయాభివృద్ధి పద్ధతిలో రాజధాని నిర్మాణం
- ఒకే రాజధాని.. అభివృద్ధి మాత్రం వికేంద్రీకృతం
- అమరావతితోపాటు విశాఖ, తిరుపతీ మెగా సిటీలే
- తీర్మానానికి మద్దతు ఇచ్చిన అందరికీ కృతజ్ఞతలు
- అసెంబ్లీలో సీఎం చంద్రబాబు ఉద్ఘాటన
- 2028 నాటికి తొలి దశ పనులు పూర్తి





**అమరావతిమార్చి 28 ఆంధ్ర ప్రగతి**

అమరావతి అజేయం, అద్భుతమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఇక ఒక్క అంగుళం కూడా అమరావతిని కదల్చలేరని స్పష్టం చేశారు. "ఇది చట్టబద్ధమైన భరోసా. తెలుగు వైభవం అయిన అమరావతే శాశ్వత రాజధాని" అని చంద్రబాబు శాసనసభలో పునరుద్ఘాటించారు. 2028 నాటికల్లా అమరావతి తొలిదశ పనులు పూర్తవుతాయని ప్రకటించారు. అమరావతి కోసం భూములు ఇచ్చిన రైతుల త్యాగా లు అసామాన్యమైనవని, అనేక కష్టనష్టాలను తట్టుకున్న వారికి పాదాభివందనం అంటూ చంద్రబాబు భావోద్వేగానికి గురయ్యారు. తీర్మానానికి మద్దతు పలికిన సభ్యులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సీఎం ఏమన్నారంటే...

మిగతా 2లో.



# మలుపు తిరిగిన యుద్ధం

- యుద్ధ క్షేత్రంలోకి హౌతీలు..
- ఇజ్రాయిల్‌పై బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం
- సౌదీలో అమెరికా స్థావరంపై ఇరాన్ దాడి
- దెబ్బతిన్న రీఫ్యూయలింగ్ విమానాలు..పలువురికి గాయాలు
- పోర్టులు, ఎయిర్‌పోర్టులే లక్ష్యంగా టెహ్రాన్ భీకర దాడులు

**ఢిల్లీమార్చి 28 ఆంధ్ర ప్రగతి**

ఇరాన్ యుద్ధం ఐదో వారంలో ప్రవేశించిన వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. పశ్చిమాసియాలో గత నెల 28న మొదలైన పోరు శనివారం కొత్త మలుపు తిరిగింది. యుద్ధం మొదలైన తర్వాత తర్వాత తొలిసారిగా యెమన్‌కు చెందిన హౌతీలు రంగంలోకి దిగారు. ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌కు దక్షిణాన ఉన్న ఇజ్రాయిల్ సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకొని బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించారు. లక్ష్యాలను సాధించే వరకూ సైనిక చర్యలను కొనసాగిస్తామని ప్రకటించారు. ఇరాన్, లెబనాన్, ఇరాక్, పాలస్తీనా భూభాగాలపై ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులకు ప్రతీకారంగా పోరు ప్రారంభించామని తెలిపారు.

మిగతా 2లో.

# ప్రతి దేశం సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది

- ప్రపంచంలోని ప్రతి దేశం ఇప్పుడు సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది: ప్రధాని మోదీ
- ఆహారం, ఇంధనం, గ్యాస్ సరఫరాపై యుద్ధం ప్రభావం పడిందన్న ప్రధానిమోదీ
- ఎన్నో దేశాల్లో నిత్యావసర వస్తువుల కొరత ఏర్పడిందని వెల్లడి
- ఇంతటి సంక్షోభం సమయంలోనూ అభివృద్ధి కొనసాగుతోందని ఉద్ఘాటన



**ఢిల్లీమార్చి 28 ఆంధ్ర ప్రగతి**

పశ్చిమాసియాలోని ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ప్రపంచంలోని ప్రతి దేశం సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి ప్రతి దేశం తీవ్రంగా ప్రయత్నిస్తోందని తెలిపారు. అక్కడ గత నెల రోజులుగా భీకర పోరు కొనసాగుతోందని అన్నారు. ఈ యుద్ధం

మిగతా 2లో.

# నేపాల్ నూతన ప్రధాని బాలెన్ షా ప్రకంపనలు

## మాజీ ప్రధాని కేపీ శర్మ ఓలీ అరెస్ట్

- గతేడాది జరిగిన జెన్-జీ ఉద్యమం అణచివేత కేసులో చర్యలు
- ఖాట్మండు వ్యాప్తంగా ప్రతిపక్ష సీపీఎన్-యూఎంఎల్ నిరసనలు
- అరెస్ట్ అనంతరం అస్వస్థతకు గురైన ఓలీ.. ఆసుపత్రికి తరలింపు



**ఢిల్లీమార్చి 28 ఆంధ్ర ప్రగతి**

నేపాల్‌లో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. నూతన ప్రధాని బాలెన్ షా వచ్చీరావడంతోనే విపక్ష నేతలను టార్గెట్ చేశారు. ఈ క్రమంలో మాజీ ప్రధాని, ప్రధాన ప్రతిపక్ష నేత కేపీ శర్మ ఓలీని పోలీసులు శనివారం

మిగతా 2లో.

# ఏపీలో కోచింగ్ సెంటర్లకు ప్రభుత్వ కళ్లెం..



- కఠిన నిబంధనల జారీ
- ఏపీలో కోచింగ్ సెంటర్లకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేస్తూ కొత్త నిబంధనలు
- విద్యార్థుల ఒత్తిడి, ఆత్మహత్యల నివారణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం
- రోజుకు 5 గంటలకే పరిమితం.. ఆదివారం తప్పనిసరిగా సెలవు
- కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీలు
- నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలతో పాటు రిజిస్ట్రేషన్ రద్దు

# త్వరలో 'ఈ-చెక్కులు'

- డిజిటల్ చెల్లింపుల్లో ఆర్బీఐ విప్లవాత్మక మార్పులు..
- డిజిటల్ చెల్లింపుల కోసం ఆర్బీఐ 'పేమెంట్స్ విజన్ 2028' విడుదల



**ఢిల్లీమార్చి 28 ఆంధ్ర ప్రగతి**

దేశంలో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక ముందడుగు వేసింది. 'పేమెంట్స్ విజన్ 2028' పేరుతో శుక్రవారం ఒక కొత్త రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించింది. ఇందులో భాగంగా ఎలక్ట్రానిక్ చెక్కుల ప్రవేశం, మోసపూరిత లావాదేవీలపై బ్యాంకుల బాధ్యతను పెంచడం వంటి పలు సంస్కరణలను ప్రతిపాదించింది.

మిగతా 2లో.

# అమరావతి ఒక్కటే రాజధాని..

- గతంలో మూడు రాజధానుల పేరిట వైసిపి నాటకాలు
- భూములు ఇచ్చిన రైతులను కేసులో హింసించారు
- బలమైన నాయకుడు చంద్రబాబు వల్లనే అభివృద్ధి సాధ్యం
- అందుకే కూటమి కట్టి ఎన్నికల్లో పోటీ చేశాం
- అసెంబ్లీలో డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్



**అమరావతి,మార్చి 28 ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక్కటే రాజధాని ఉందని, అది అమరావతి మాత్రమేనని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. చంద్రబాబులాంటి వ్యక్తి చేతిలో ఏపీ ఉంటేనే అభివృద్ధి చెందుతుందని అన్నారు. రాజధాని కోసం రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని తెలిపారు. వైసీపీ పాలనలో అమరావతిపై కక్ష కట్టారని, మూడు రాజధానులంటూ

మిగతా 2లో.

# మూసీకి ఆధ్యాత్మికత

## రూ.700 కోట్లతో ఓంకారేశ్వర ఆలయం.. శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి

- మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా మంచిరేవులలో ఓంకారేశ్వర ఆలయ నిర్మాణం
- 8 ఎకరాల విస్తీర్ణంలో ఆలయ పనులకు సీఎం రేవంత్ శంకుస్థాపన
- మూసీ నది మధ్యలో 100 అడుగుల శివుడి విగ్రహం ఏర్పాటు.. పర్యాటక సౌకర్యాల కల్పన
- చారిత్రక ఆలయాలతో కలిపి ఈ ప్రాంతాన్ని 'చిన్న శ్రీశైలం'గా తీర్చిదిద్దే ప్రణాళిక

**హైదరాబాద్ మార్చి 28 ఆంధ్ర ప్రగతి**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో మరో కీలక ముందడుగు పడింది. హైదరాబాద్ శివార్లలోని గండిపేట మండలం మంచిరేవుల వద్ద రూ.700 కోట్ల భారీ వ్యయంతో నిర్మించనున్న ఓంకారేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు

మిగతా 2లో.



# జగన్ హయాంలోనే అమరావతిలో రోడ్ల నిర్మాణం : పేర్ని నాని



**అమరావతి,మార్చి 28 ఆంధ్ర ప్రగతి**

రాజధాని అమరావతిని చంద్రబాబు అప్పులకుప్పగా మార్చారని, కాంట్రాక్టర్ల దోపిడీ కోసం దీనిని ఒక 'ఏటీఎమ్'లా వాడుకుంటున్నారని మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నాని మండిపడ్డారు. ఇప్పటివరకు ఖర్చు చేసిన రూ. 21 వేల కోట్లపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన చట్టబద్ధత తీర్మానం కేవలం ఒక 'డ్రామా' అని, శాసనమండలి ఆమోదం లేకుండా కేవలం

మిగతా 2లో.

# జర్నలిస్టుల సంక్షేమంలో ఎప్పుడూ ముందున్నా

- గతంలో ఉమ్మడి ఎపిలో అనేక కార్యక్రమాలు చేపట్టా
- వారికి ప్రాధాన్యక్రమంలో భూములు ఇస్తాను
- సోషల్ మీడియా వ్యక్తిత్వ హననంపై ఆందోళన
- ఐజెయూ సమవేశంలో సిఎం చంద్రబాబు




**అమరావతి,మార్చి 28 ఆంధ్ర ప్రగతి**

జర్నలిస్టుల సంక్షేమానికి పాటుపడడంలో తానే ముందున్నానని, ఉమ్మడి ఎపిలో అయినా, విభజిత ఎపిలో అయినా అనేక సంక్షేమ చర్యలు చేపట్టామని సిఎం చంద్రబాబు అన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ 11వ ప్లీనరీ సమావేశాల ప్రారంభ కార్యక్రమంలో ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి కాలంలో సోషల్ మీడియా ఓ పెద్ద సవాలుగా మారిందని అన్నారు. కొందరు వ్యక్తులు కేవలం అసభ్యకరమైన

మిగతా 2లో.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



## ప్రతి దేశం సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది

మొదటిపేజీ తరువాయి

కారణంగా ఆహారం, ఇంధనం, గ్యాస్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నో దేశాల్లో నిత్యావసర వస్తువుల కొరత ఏర్పడిందని అన్నారు.

ప్రపంచమంతా ఎదుర్కొంటున్న ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని అన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల నుంచి మన దేశాన్ని రక్షించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. రైతులు, ప్రజలపై ఈ యుద్ధం భారం పడకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇంతటి సంక్షోభ సమయంలో మన దేశంలో అభివృద్ధి కొనసాగుతోందని అన్నారు.

ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అందరూ ఐక్యంగా ఉండాలని, ప్రశాంతతను పాటించాలని ప్రధాని మోదీ కోరారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో విపక్షాలు ప్రజలను గందరగోళానికి గురిచేయవద్దని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం విధానాలు దేశం, ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా ఉంటాయని అన్నారు. నోయిడాలోని జేవార్ ప్రాంతంలో పీపీపీ పద్ధతిలో నిర్మిస్తున్న అంతర్జాతీయ విమానాశ్రయం ప్రాజెక్టు మొదటి దశను ప్రధాని మోదీ శనివారం ప్రారంభించారు. రూ.11,200 కోట్లతో దీనిని నిర్మిస్తున్నారు. ఆధునాతన నావిగేషన్ సిస్టమ్స్ సహాయంతో 3,900 మీటర్ల పొడవైన ఈ విమానాశ్రయం రన్‌వేపై అతిపెద్ద విమానాలు కూడా రాకపోకలు సాగించే వీలుంది. సరకు రవాణా కోసం కార్గో లాజిస్టిక్ జోన్లను అనుసంధానం చేస్తూ మల్టీమోడల్ కార్గో హబ్‌నూ నిర్మించారు.

## త్వరలో 'ఈ-చెక్కులు'

మొదటిపేజీ తరువాయి

వినియోగదారుల భద్రతకు పెద్దపీట వేస్తూ ఆర్బీఐ కీలక సూచనలు చేసింది. ప్రస్తుతం డెబిట్, క్రెడిట్ కార్డులకు మాత్రమే ఉన్న ఎనేబుల్/డిసేబుల్ సదుపాయాన్ని ఇకపై అన్ని రకాల డిజిటల్ చెల్లింపులకు వర్తింపజేయాలని ప్రతిపాదించింది. దీనివల్ల ఖాతాదారులు తమ లావాదేవీలపై పూర్తి నియంత్రణ కలిగి ఉండవచ్చు. అంతేకాకుండా, అనధికారిక లావాదేవీలు జరిగినప్పుడు, డబ్బు పంపిన బ్యాంకుతో పాటు స్వీకరించిన బ్యాంకు కూడా ఉమ్మడి బాధ్యత వహించేలా ఒక ఫ్రేమ్‌వర్క్‌ను తీసుకురావాలని యోచిస్తోంది.కొత్త వ్యాపార అవసరాలకు అనుగుణంగా కాగితపు చెక్కుల ప్రయోజనాలను, డిజిటల్ వేగాన్ని కలిపి 'ఈ–చెక్కుల'ను ప్రవేశపెట్టే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ఆర్బీఐ తన నివేదికలో పేర్కొంది. దీంతోపాటు, చెల్లింపుల వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న ఈ–కామర్స్ మార్కెట్ ప్లేస్‌లు, ఇతర సెంట్రలైజ్డ్ ప్లాట్‌ఫామ్‌లను కూడా తమ ప్రత్యక్ష నియంత్రణ పరిధిలోకి తీసుకురావాలని భావిస్తోంది.వీటితో పాటు చెక్కుల భద్రతా ఫీచర్లను సమీక్షించడం, లావాదేవీలను సులభంగా ట్రేస్ చేసేందుకు కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయడం, విదేశీ చెల్లింపులను వేగవంతం చేయడం వంటి అంశాలను కూడా ఈ విజన్ డాక్యుమెంట్‌లో పొందుపరిచారు. ఈ మార్పుల ద్వారా దేశీయ చెల్లింపుల వ్యవస్థను మరింత వేగవంతంగా, సురక్షితంగా, విశ్వసనీయంగా మార్చడమే లక్ష్యమని ఆర్బీఐ స్పష్టం చేసింది.

## నేపాల్ నూతన ప్రధాని బాలెన్ షా ప్రకంపనలు

మొదటిపేజీ తరువాయి

ఉదయం అరెస్ట్ చేశారు. గతేడాది సెప్టెంబరులో జరిగిన 'జెన్–జీ' యువత ఉద్యమాన్ని అణచివేసిన ఘటనకు సంబంధించిన నరహత్య కేసులో ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ అరెస్ట్‌తో రాజధాని ఖాట్మండూ వ్యాప్తంగా తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి.ఓలీతో పాటు మాజీ హోంమంత్రి రమేశ్ లేఖక్‌ను కూడా భక్తపూర్ జిల్లాలోని వారి నివాసాల నుంచి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అనంతరం ఓలీ అస్వస్థతకు గురికావడంతో, ఆయనను ఖాట్మండూలోని ఓ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఓలీ అరెస్ట్‌ను నిరసిస్తూ ఆయన నేతృత్వంలోని కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్ (యూఎంఎల్) కార్యకర్తలు ఖాట్మండూలో ఆందోళనలు చేపట్టారు. పలుచోట్ల టైర్లు కాల్చి, విచారణ కమిషన్ నివేదిక ప్రతులను దహనం చేశారు. నిరసనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణలు జరిగాయి. శుక్రవారం కొలువుదీరిన ప్రధాని బాలేంద్ర షా నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం తన తొలి కేబినెట్ సమావేశంలోనే విచారణ కమిషన్ నివేదికను అమలు చేయాలని నిర్ణయించింది. ఈ అరెస్టులు కక్షపూరితమైనవని, చట్టవిరుద్ధమని యూఎంఎల్ పార్టీ ఖండించింది. సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో ఉన్నతస్థాయి విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది.

ఇదిలా ఉండగా, ఓలీ అరెస్ట్‌ను నేపాల్ మాజీ అధ్యక్షురాలు బిద్యాదేవి భండారీ 'అవివేక నిర్ణయం'గా అభివర్ణించారు. ఈ చర్య దీర్ఘకాలిక పరిణామాలకు దారితీయవచ్చని, దేశంలో అస్థిరత పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సరైన అధ్యయనం, న్యాయ ప్రక్రియ లేకుండా నివేదికను అమలు చేయడం ప్రజాస్వామ్య విలువలకే విఘాతమని ఆమె ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## మలుపు తిరిగిన యుద్ధం

మొదటిపేజీ తరువాయి

యెమన్‌కు ఆవల ఉన్న లక్ష్యాలపై కూడా దాడి చేసే సామర్థ్యం తమకు ఉన్నదని హైతీలు ఈ చర్య ద్వారా నిరూపించుకున్నారు. అరేబియన్ ద్వీపకల్పం, ఎర్ర సముద్రం పరిసరాలలో ప్రయాణించే నౌకలను అడ్డుకునే సామర్థ్యం హౌతీలకు ఉంది. 2023 అక్టోబర్ 7 తర్వాత గాజాలో హమాస్‌కు మద్దతుగా వారు జల రవాణాను అడ్డుకున్న విషయం తెలిసిందే. హర్మూజ్ జలసంధిపై ఇరాన్‌కు పట్టు ఉండగా సూయజ్ కెనాల్‌కు దారితీసే బాబ్ అల్–మందబ్ జలసంధిపై హౌతీలకు నియంత్రణ ఉంది.

సౌదీలో దెబ్బతిన్న అమెరికా రీఫ్యూయలింగ్ విమానాలుఉపలువురికి గాయాలు

గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై దాడులను ఇరాన్ ముమ్మరం చేసింది. సౌదీ అరేబియాలోని కీలక అమెరికా స్థావరంపై ఆరు క్షిపణులు, 29 డ్రోన్లతో శుక్రవారం పెద్ద ఎత్తున దాడి జరిపింది. ఈ దాడిలో పదిహేను మంది అమెరికా సైనికులు గాయపడ్డారు. వీరిలో ఐదుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. దాడిలో అనేక అమెరికా రీఫ్యూయలింగ్ విమానాలు దెబ్బతిన్నాయి. ప్రిన్స్ సుల్తాన్ వైమానిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకొని ఇరాన్ దాడి చేసిందని అమెరికా అధికారి ధృవీకరించారు.

యుద్ధం ప్రారంభమైన తర్వాత ప్రిన్స్ సుల్తాన్ వైమానిక స్థావరంపై ఇరాన్ దాడి చేయడం ఇది రెండోసారి. కాగా ఒమన్ తీరంలో ఉన్న అమెరికా నౌకపై ఇరాన్ దళాలు శనివారం ఉదయం దాడి చేశాయి. ఒమన్ తీరంలో దాడి జరిగినప్పటికీ ఆ దేశం యొక్క సార్వభౌమత్వాన్ని పూర్తిగా గౌరవిస్తూనే ఈ చర్యకు దిగామని ఖతమ్ అల్–అన్బియా కేంద్ర కార్యాలయ ప్రతినిధి అబ్రహం జోల్ఫగనీ తెలిపారు.

## జర్నలిస్టుల సంక్షేమంలో ఎప్పడూ ముందున్నా

మొదటిపేజీ తరువాయి

కంటెంట్‌ను ప్రచారం చేయడానికి, ఇతరుల వ్యక్తిత్వ హననం చేయడానికే సామాజిక మాధ్యమాలను వాడుతున్నారని మండిపడ్డారు. 'తప్పుడు ప్రచారాలతో ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారు. ఇది దేశానికి చాలా ప్రమాదకరం. దీనిని ఎలా నియంత్రించాలో, ప్రజలను ఎలా చైతన్యపరచాలో మనమందరం ఆలోచించాలి. రాబోయే ఒకటి రెండేళ్లలో 3వ స్థానానికి, 2038 నాటికి 2వ స్థానానికి, 2047 లేదా 2050 నాటికి ప్రపంచంలోనే నంబర్ వన్ ఆర్థిక వ్యవస్థగా మన దేశం ఎదిగే అవకాశముందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. ఇకపోతే గతంలో హైదరాబాద్‌లో ప్రెస్ క్లబ్‌లకు, జర్నలిస్టులకు విలువైన ప్రాంతాల్లో భూములిచ్చామన్నారు. అమరావతిలోనూ పాత్రికేయుల నివాసాల కోసం భూమి కేటాయించేందుకు సానుకూలంగా పరిశీలిస్తామని భరోసానిచ్చారు. మండల రిపోర్టర్లకు అక్రిడిటేషన్ సౌకర్యం కల్పించడం సహా జర్నలిస్ట్ సంక్షేమ నిధి ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రమాద బీమా సౌకర్యాన్ని పది లక్షల రూపాయలకు పెంచామని.. డెస్క్ జర్నలిస్టులకు, సబ్ ఎడిటర్లకూ అక్రిడిటేషన్, బస్సు ప్రయాణ రాయితీలు కల్పించామని చెప్పుకొచ్చారు. అమరావతిలో భూమి మానిటైజేషన్ ప్రాజెక్ట్ అయినప్పటికీ.. ఓ పద్ధతి ప్రకారం జర్నలిస్టుల సంక్షేమం కోసం నిర్ణయం తీసుకుంటాం. గతంలో కేవలం కమ్యూనిస్ట్ పార్టీలే తమ సిద్ధాంతాలను ప్రచారం చేసుకోవడానికి సొంత పత్రికలను కలిగిఉండేవి. కానీ.. నేడు రాజకీయ నాయకులే స్వయంగా మీడియా సంస్థలను నడుపుతున్నారు. ఇది ప్రజాస్వామ్యానికి చాలా ప్రమాదకరమైన ధోరణి. వృత్తిపరమైన మీడియా, రాజకీయ పార్టీల యాజమాన్యంలోని మీడియాల మధ్య స్పష్టమైన తేడా ఉండాలని నేను కోరుకుంటున్నానని చంద్రబాబు పేర్కొన్నారు. ఐదు దశాబ్దాలుగా తాను రాజకీయాల్లో ఉన్నానని ఈ సందర్భంగా స్మరించుకున్నారు చంద్రబాబు. కరెంటులేక పొలాలు ఎండిపోతున్నాయని తాను అసెంబ్లీని వాయిదావేసి మరీ క్షేత్రస్థాయికి వెళ్లిన రోజులు గుర్తున్నాయన్నారు. '90వ దశకం చివరలో నేను విద్యుత్ రంగంలో సంస్కరణలు ప్రవేశపెట్టాను. దేశం కోసం, రాష్ట్రం కోసం నేను విద్యుత్ తీసుకొచ్చినా.. దురదృష్టవశాత్తూ 2004లో అధికారాన్ని కోల్పోవాల్సి వచ్చింది. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన ఎప్పుడూ కలిసే సాగాలి. నేడు సమాజంలో విలువలు పడిపోవడం, సిద్ధాంతాలు మారిపోవడం ఆందోళన కలిగిస్తోంది. మా వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్‌టీ.రామారావును ఒకసారి 'మీరు కమ్యూనిజమా, సోషలిజమా లేక క్యాపిటలిజమా?' అని అడిగితే.. తానొక 'ఉత్తమ మానవతావాదిని' అని ఆయన సమాధానమిచ్చారు' అని ముఖ్యమంత్రి నాటి జ్ఞాపకాలను గురించి వివరించారు. హైదరాబాద్ అభివృద్ధి గురించి ఏపీ సీఎం మాట్లాడుతూ.. 'హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తామంటే నాడు అందరూ నవ్వుకున్నారు. కానీ పాతికేళ్ల తర్వాత నేడు తెలంగాణ తలసరి ఆదాయంలో అగ్రస్థానంలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న గ్లోబల్ కాంపిటెన్సీ సెంటర్లలో 25 శాతం హైదరాబాద్‌కే వస్తున్నాయి. రాష్ట్ర విభజన కంటే కూడా 2019 నుంచి 2024 మధ్య జరిగిన విధ్వంసం వల్లే ఆంధ్రప్రదేశ్ ఎక్కువగా నష్టపోయింది. మళ్లీ మనం అశ్రద్ధ చేస్తే, సమస్యలు వస్తాయనే విషయం గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఉంది. ప్రపంచంలో ఎక్కడా జరగని విధంగా మూడు రాజధానులని మాట్లాడారు. కొంతవరకు మీడియా అంతా కూడా దీనిని

## మూసీకి ఆధ్యాత్మికత



మొదటిపేజీ తరువాయి

. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు ఎమ్మెల్యేలతో కలిసి ఆయన భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. మూసీ తీరాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా మార్చే లక్ష్యంలో భాగంగా 8 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఆలయాన్ని నిర్మించనున్నారు.

శృంగేరి శారదాపీఠం జగద్గురువుల సూచనల మేరకు ఈ ఆలయ డిజైన్‌ను ఖరారు చేశారు. ఆలయ ప్రవేశంలో 100 అడుగుల ఎత్తైన రాజగోపురం, సాంస్కృతిక కార్యక్రమాల కోసం ప్రత్యేక మండపాలు నిర్మిస్తారు. 207 అడుగుల పొడవైన మహామండపం, దానిని ఆనుకుని ఓంకారేశ్వర మందిరం కొలువుదీరనుంది. యాదగిరిగుట్ట తర్వాత రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద గర్భాలయంగా ఇది నిలవనుంది. రామప్ప, యాదగిరిగుట్ట నిర్మాణాల్లో వాడిన నాణ్యమైన కృష్ణశిలతోనే ఈ ఆలయాన్ని కూడా నిర్మించనుండటం విశేషం.

ఈ ప్రాజెక్టులో భాగంగా మూసీ నది మధ్యలో 100 అడుగుల భారీ శివుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. నదిపై చెక్‌డ్యామ్ నిర్మించి బోటింగ్ వంటి పర్యాటక సౌకర్యాలను కల్పించనున్నారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం 2,000 వాహనాలకు సరిపడా పార్కింగ్ వసతి, ఔటర్ రింగ్ రోడ్డు నుంచి నేరుగా కనెక్టివిటీ కల్పిస్తారు. సమీపంలోని శతాబ్దాల చరిత్ర కలిగిన వీరభద్రస్వామి ఆలయం ఉన్న గుట్టపైకి వెళ్లేందుకు అత్యాధునిక తీగల వంతెనను నిర్మించనున్నారు.

ఈ ప్రాంతంలో ఇప్పటికే 1400 ఏళ్ల నాటి చాళుక్యుల కాలం నాటి మచిలేశ్వర ఆలయం, 800 ఏళ్ల నాటి కాకతీయుల వీరభద్రస్వామి ఆలయం ఉన్నాయి. చేప ఆకారంలో శివలింగం ఉండటంతో ఈ ఆలయానికి మచిలేశ్వరుడు అనే పేరు వచ్చింది. ఇప్పుడు నిర్మించబోయే అధునాతన ఓంకారేశ్వర ఆలయంతో ఈ ప్రాంతం ప్రాచీన, ఆధునికతల సంగమంగా మారి 'చిన్న శ్రీశైలం'గా ప్రసిద్ధి చెందుతుందని ప్రభుత్వం, భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఏపీలో కోచింగ్ సెంటర్లకు ప్రభుత్వ కళ్లెం..

### కఠిన నిబంధనల జారీ

**అమరావతి,మార్చి 28 ఆంధ్ర ప్రగతి**

ఏపీలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ప్రైవేట్ కోచింగ్ సెంటర్ల నియంత్రణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. విద్యార్థులపై పెరుగుతున్న ఒత్తిడి, ఆత్మహత్యల నివారణే లక్ష్యంగా కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇకపై రాష్ట్రంలో కోచింగ్ సెంటర్ నిర్వహించాలంటే రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేస్తూ 'ఏపీ కోచింగ్ సెంటర్ల నియంత్రణ, పర్యవేక్షణ నిబంధనలు–2026' పేరుతో కొత్త నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఇప్పటికే నడుస్తున్న కేంద్రాలు కూడా మూడు నెలల్లోగా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని స్పష్టం చేసింది.

ఇటీవలి కాలంలో విద్యార్థులపై ఒత్తిడి పెరిగి ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనల నేపథ్యంలో ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. కొత్త నిబంధనల పర్యవేక్షణ కోసం జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేయనుంది. ఈ కమిటీయే కోచింగ్ సెంటర్లకు రిజిస్ట్రేషన్లు మంజూరు చేయడం, విద్యార్థుల




నుంచి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించడం వంటి బాధ్యతలు చూస్తుంది. అంతేగాక మీడియా కథనాలు లేదా పోలీసు రిపోర్టుల ఆధారంగా సుమోటోగా తనిఖీలు చేసే అధికారాన్ని కూడా ఈ కమిటీకి కల్పించారు.

కొత్త నిబంధనల ప్రకారం కోచింగ్ సెంటర్లు రోజుకు గరిష్ఠంగా ఐదు గంటలు మాత్రమే పనిచేయాలి. పాఠశాలలు, కళాశాలలు నడిచే సమయంలో కోచింగ్ తరగతులు నిర్వహించకూడదు. ఆదివారం తప్పనిసరిగా సెలవు ప్రకటించాలి. విద్యార్థుల మానసిక ఆరోగ్యం కోసం ప్రతి కేంద్రంలో ఒక వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేసి, కౌన్సిలింగ్ అందించాలి. ఆత్మహత్యలను నివారించేందుకు స్ప్రింగ్ లోడెడ్ ఫ్యాన్లను ఏర్పాటు చేయాలని నిబంధనల్లో స్పష్టంగా పేర్కొన్నారు.

**ఫీజు తిరిగివ్వాలి.. సర్టిఫికెట్లు తీసుకోవద్దు**

ఫీజుల విషయంలో విద్యార్థులను వేధించకూడదని, ఒకవేళ విద్యార్థి మధ్యలో కోర్సు మానేస్తే మిగిలిన కాలానికి ఫీజును దామాషా ప్రకారం తిరిగి చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించింది. అడ్మిషన్ల సమయంలో విద్యార్థుల ఒరిజినల్ అకడమిక్ సర్టిఫికెట్లను తీసుకోరాదు. ప్రభుత్వ ఉపాధ్యాయులు, లెక్చరర్లు ఈ కోచింగ్ సెంటర్లలో పనిచేయడంపై నిషేధం విధించారు. ప్రతి కోచింగ్ సెంటర్ తప్పనిసరిగా ఒక వెబ్‌సైట్‌ను నిర్వహించాలని, అందులో ఫీజులు, సిబ్బంది, మౌలిక వసతుల వివరాలను పొందుపరచాలని ఆదేశించారు.

**నిబంధనలు మీరితే రిజిస్ట్రేషన్ రద్దు.. కోచింగ్ సెంటర్లకు భారీ జరిమానాలు**

నిబంధనలు ఉల్లంఘించిన కేంద్రాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోనుంది. లోపాలను సరిదిద్దుకోవడానికి 15 రోజుల గడువు ఇస్తారు. ఆ తర్వాత కూడా నిబంధనలు పాటించకపోతే మొదటిసారి రూ. 50 వేలు, రెండోసారి రూ. లక్ష జరిమానా విధిస్తారు. మూడోసారి కూడా ఉల్లంఘన పునరావృతమైతే ఆ సెంటర్ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తారు.

## అమరావతికి రాజముద్ర

మొదటిపేజీ తరువాయి

"అమరావతికి వ్యతిరేకంగా జరిగిన కుట్రలు, కుతంత్రాలు, రైతుల పట్ల గత ప్రభుత్వం చేసిన దమనకాండ, అన్యాయం చూసి చలించిపోయాను. అనేక సందర్భాల్లో చాలా కోపం వచ్చింది. ఇంత అన్యాయం చేస్తారా? అని భావోద్వేగానికి లోనయ్యాను. ఆనాటి పరిణామాలను సభలో పలువురు సభ్యులు గుర్తు చేసినప్పుడు మరోసారి ఉద్వేగం కలిగింది. ఇంత జరిగినా రాజధానిపై వైసీపీ బుద్ధి మారలేదు. గతంలో మాదిరిగానే ఇంకా అమరావతిపై కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతూనే ఉంది. రాజ్యాంగంలో రాజధాని అనే పేరే లేదంటున్నారు. వీళ్లకు ఏమైనా ప్రత్యేకమైన రాజ్యాంగం ఉందేమో? రాజారెడ్డి రాజ్యాంగాన్ని వాళ్లు అనుసరిస్తారు. కానీ మనం అంబేద్కర్ రాజ్యాంగం అనుసరిస్తున్నాం. విభజన అనంతరం ఏపీకి రాజధాని విజయవాడ–గుంటూరు మధ్య ఏర్పాటు చేయాలని 46 శాతం మంది కోరుకున్నట్లుగా శివరామకృష్ణన్ కమిటీ స్పష్టంగా చెప్పింది. మేం అదే పని చేశాం. చారిత్రక నేపథ్యం ఉన్న అమరావతి ప్రాంతాన్నే రాజధానిగా ఏర్పాటు చేశాం. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న జగన్ బేషరతుగా అమరావతికి మద్దతు ఇస్తున్నానని గతంలో చెప్పారు. కానీ ఇప్పుడు రోజుకో మాటతో ఊసరవెల్లి రాజకీయాలు చేస్తున్నారు.""ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైసీపీ 2019 నుంచే విధ్వంస పాలన మొదలుపెట్టింది. వారి చర్యలతో రాష్ట్రాన్ని 30 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లారు. అమరావతి కోసం భూములు ఇచ్చిన రైతులు రాజధాని పరిరక్షణ కోసం, జగన్ మూడు ముక్కలాటకు నిరసనగా చేపట్టిన ప్రజా పోరాటాలను ఉక్కుపాదంతో అణచివేశారు. రైతులు, మహిళలపై కేసులు పెట్టి బూట్లతో తన్నారు. లాఠీలతో కొట్టారు. అడ్డగోలుగా కేసులు పెట్టి కీచకపర్వం సాగించారు. శాసనమండలిలో మూడు రాజధానుల బిల్లును సెలెక్ట్ కమిటీ ద్వారా పాస్ చేయించాలని చూశారు. అయినా హైకోర్టు న్యాయాన్ని కాపాడింది. మూడు రాజధానుల ప్రతిపాదన తుగ్లక్ నిర్ణయమని మీడియా పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం చేసింది. గత పాలనలో రైతులు, మహిళలు, నేను, పవన్ సహా అందరం బాధితులమే.""రాష్ట్రానికి రాజధాని ఒక్కటే. అదే అమరావతి. కానీ, అభివృద్ధి మాత్రం వికేంద్రీకృతం. రాష్ట్రంలోని అ న్ని ప్రాంతాలను ప్రగతిపథంలోకి తెస్తాం. విశాఖపట్నం, తిరుపతి, అమరావతి రీజియన్లుగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాం. ఆ ప్రాంతాలను మెగా సిటీలుగా అభివృద్ధిచేస్తాం. అమరావతి స్వయం అభివృద్ధి విధానంలో నిర్మితమవుతుందని చెప్పాం..అదే జరుగుతుంది.""అమరావతి నిర్మాణ బాధ్యతను పార్లమెంట్ తీసుకుంటుందని ప్రధాని నరేంద్రమోదీ భరోసా ఇచ్చారు. అమరావతి నిర్మాణానికి కేంద్రం రూ. 15వేల కోట్ల తక్షణ సహాయం అందించింది. నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. 2028 నాటికి తొలిదశ పనులు పూర్తిచేసి అమరావతికి ఒక రూపు తీసుకొస్తాం. 2027 నాటికి రహదారులు, లే అవుట్‌లు సహా కీలకమైన మౌలిక సదుపాయాల కల్పన పూర్తవుతుంది. ప్రస్తుతం రూ.56వేల కోట్ల విలువైన 91 పనులు వేగంగా జరుగుతున్నాయి. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తిచేయించి ప్రధాన మంత్రిని పిలిపించి, ఆయనతోనే ప్రార ంభింపచేస్తాం. ఇదే మా సంకల్పం. ప్రతి తెలుగువ్యక్తీ గర్వపడేలా అమరావతి రాజధాని ఉంటుంది. నాది అమరావతి, నా రాజధాని అమరావతి అని తెలుగు ప్రజలు గర్వంగా చెప్పుకునే రోజు తప్పకుండా వస్తుంది." అని సీఎం చంద్ర బాబు వ్యాఖ్యానించారు.

## అమరావతి ఒక్కటే రాజధాని..

మొదటిపేజీ తరువాయి

మూడుముక్కలాట ఆడారని మండిపడ్డారు. వైసీపీ పాలనలో ప్రజలకు రక్షణ లేకుండాపోయిందన్నారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులను హింసించారని ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతిపై చర్చలో శనివారం పవన్ అసెంబ్లీలో మాట్లాడుతూ.. 'రాజకీయ స్థిరత్వం చాలా ముఖ్యం. తెలంగాణ వేరు.. ఏపీ వేరు అనే భావన మాకెప్పుడూ లేదు. తెలుగునేల అనేదొక్కటే మా భావన. రాష్ట్ర విభజనలో కాంగ్రెస్ బాధ్యతగా వ్యవహరించలేదు. రాజధాని లేని రాష్ట్రంగా మనం ఇంకా కొట్టుకుంటూనే ఉన్నాం. ఏపీ నేలపై ప్రేమతోనే ఎలాంటి షరతులు లేకుండా టీడీపీతో కలిశాం. రాష్ట్రాన్ని కాపాడుకోవాలనే కూటమిగా ఏర్పడ్డాం. వైసీపీ హయాంలో ఎక్కడ చూసినా అరాచకమే. ఇళ్ల నుంచి బయటకు రావాలంటే మహిళలు భయపడేవారు. ప్రశ్నించిన అందరిపైనా దాడులు చేశారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని విభజించేటప్పుడు కాంగ్రెస్ బాధ్యతగా వ్యవహరించ లేదని అన్నారు. రాష్ట్రం ఏర్పడే నాటికి సరైన కార్యాలయాలు లేవని, చంద్రబాబు బలమైన ఆశావాది కాబట్టి.. కార్యాలయాలు లేకపోయినా టెంట్ వేసుకొనైనా పని చేద్దామని ఆశించారన్నారు. రాష్ట్రం ఏర్పడి ఇన్నేళ్లయినా.. ఇప్పటికీ రాజధాని కోసం కొట్టుకుంటున్నాం. ఇప్పటికీ రాజధాని, సరైన హైకోర్టు లేదని తలచుకుంటే బాధేస్తోంది. అభివృద్ధికి రాజకీయ స్థిరత్వం చాలా ముఖ్యం. రాజధాని కోసం మెజార్టీ రైతులు ఇష్టపూర్వకంగానే భూములు ఇచ్చారు. ఎలాంటి గొడవలు లేకుండా 33వేల ఎకరాలు రాజధాని కోసం సేకరించారు. 2019లో ప్రభుత్వం మారాక.. అమరావతిపై కక్ష కట్టారు. అమరావతి రైతులకు మద్దతుగా నేను వెళ్తే.. ముళ్ల కంచెలు వేశారు. వైకాపా హయాంలో శాసనసభ్యులకే రక్షణ లేకపోతే.. రైతులకు ఎలా ఉంటుంది? రాజధాని కోసం భూములిచ్చిన రైతులను వైకాపా హయాంలో హింసించారు. వైకాపా హయాంలో మూడు రాజధానుల ప్రతిపాదన చేశారు. రాజధాని సమస్యను పరిష్కరించకపోగా.. కఠినం చేశారు. వైకాపా మళ్లీ వస్తే.. పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. వైకాపా మళ్లీ రాదు.. వచ్చినా ఏం చేయలేదు. అమరావతి రైతుల కోసం మనమంతా ఒకే మాటపై ఉండాలని అన్నారు. అమరావతిపై జనసేన ఎప్పుడూ మాట మార్చదు..దీనికి కట్టుబడి ఉన్నాం. చట్టసభల్లో కూర్చొని దాడులు చేస్తామంటే.. చూస్తూ ఊరుకోం అన్నారు. రాష్ట్రంలో రాజకీయ స్థిరత్వం ఉంటేనే.. పెట్టుబడులు వస్తాయి. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసేటప్పుడు చంద్రబాబును అందరూ విమర్శించారు. ప్రపంచబ్యాంకుతో కుమ్మక్కయ్యారని ఆరోపించేవాళ్లు. రాజకీయ నేత ఎన్నికల గురించి ఆలోచిస్తాడు. దార్శనికుడు ఒక తరం గురించి ఆలోచిస్తాడని పవన్ అన్నారు.

## జగన్ హయాంలోనే అమరావతిలో రోడ్ల నిర్మాణం : పేర్ని నాని

మొదటిపేజీ తరువాయి

అసెంబ్లీ తీర్మానంతో చట్టబద్ధత ఎలా వస్తుందని ఆయన ప్రశ్నించారు. కూటమి నేతలు కేవలం జగన్‌ను తిట్టడానికే సమయాన్ని వృథా చేశారని ఆరోపించారు.

నిజానికి జగన్ హయాంలోనే అమరావతిలో రోడ్ల నిర్మాణం జరిగిందని, ఆయనకు రాజధానిపై కోపం ఉంటే తాడేపల్లిలో ఇల్లు ఎందుకు కట్టుకుంటారని నాని నిలదీశారు. అమరావతిలో



పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలను రద్దు చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం రాజధానిపైనే కాకుండా, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, కడప స్టీల్ ప్లాంట్, విశాఖ ఉక్కుకు సొంత గనుల కేటాయింపు వంటి అంశాలపై అసెంబ్లీలో తీర్మానాలు చేయాలని కూటమి ప్రభుత్వానికి ఆయన సవాల్ విసిరారు. అప్పుడే ప్రభుత్వానికి రాష్ట్రంపై చిత్తశుద్ధి ఉందని నమ్ముతామని స్పష్టం చేశారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
ఆదివారం 29 మార్చి 2026

# నియోజకవర్గాల వారీగా జిడిడిపి పెంచే విధంగా యాక్షన్ ప్లాన్ రూపొందించండి.

## ..జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.

**ఆంధ్ర ప్రగతి కర్నూలు, మార్చి 28:**
నియోజకవర్గాల వారీగా జిడిడిపి పెంచే విధంగా యాక్షన్ ప్లాన్ రూపొందించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి నియోజకవర్గ స్పెషల్ అధికారులను ఆదేశించారు.

శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో నియోజకవర్గ విజన్ కార్యాచరణ ప్రణాళికపై నియోజకవర్గ స్పెషల్ అధికారులతో, నియోజకవర్గ విజన్ కార్యాచరణ ప్రణాళిక సిబ్బందితో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2025-26 నియోజకవర్గ కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ లలో అన్ని నియోజకవర్గాలు 85 శాతం పైగా స్కోరు సాధించి గ్రేడ్ ఏ లో ఉన్నారని, అక్కడితో సంతృప్తి చెందకుండా 2026-27 సంవత్సరంలో 90 శాతం పైగా మార్కులు సాధించి గ్రేడ్ ఏ+ లో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నియోజకవర్గ స్పెషల్ అధికారులను ఆదేశించారు. స్కోరుతో పాటు డేటా ఎంట్రీని కూడా నిర్ణీత సమయంలోగా పూర్తి చేయడం చాలా ముఖ్యమని, ఆమేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

రాష్ట్ర విభజన (2014) తర్వాత ఆంధ్రప్రదేశ్ ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ రంగం వాటా పెరిగిందన్నారు. కానీ పారిశ్రామిక, సేవా రంగాల్లో వాటాలు గణనీయంగా తగ్గాయన్నారు. సేవా రంగం ద్వారా వచ్చే ఆదాయం 10% కంటే ఎక్కువ తగ్గిందని, దీనివల్ల రాష్ట్ర ఆదాయంపై ప్రభావం పడిందన్నారు. సేవా మరియు పారిశ్రామిక రంగాలు తగ్గడం వల్ల రాష్ట్ర తలసరి ఆదాయం కూడా ప్రభావితమైందని కలెక్టర్ పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడానికి పరిశ్రమలను స్థాపించడం, సేవా రంగాన్ని ప్రోత్సహించడం, ఉపాధి అవకాశాలను పెంచడం తద్వారా తలసరి ఆదాయాన్ని పెంచవచ్చని కలెక్టర్ తెలిపారు. కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ ను సక్రమంగా పర్యవేక్షిస్తే, ఆటోమేటిక్ గా జిల్లా జిడిపి పెరుగుతుందన్నారు.




మన జిల్లా భౌగోళిక పరిస్థితులను బట్టి చూస్తే, మనకు ఫిషింగ్, ఫారెస్ట్రీ చాలా తక్కువగా ఉన్నాయన్నారు. మనకున్నది ప్రధానంగా హార్టికల్చర్, అగ్రికల్చర్, పశు సంవర్ధక శాఖ ఈ మూడూ ఎక్కువగా ఉన్నాయన్నారు. అందువల్ల హార్టికల్చర్ మీద ఎక్కువ దృష్టి సారించాలన్నారు. రాయలసీమ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది కాబట్టి జిల్లాలో హార్టికల్చర్ పెరగాలన్నారు. ప్రతి ఒక్క నియోజకవర్గ స్పెషల్ అధికారి మీ నియోజకవర్గాల్లో, మీ మండలాల్లో సంబంధిత హార్టికల్చర్ అధికారులతో మాట్లాడి, హార్టికల్చర్ విస్తరణ ఎంతవరకు ఉందో చూడాలన్నారు. మనకున్న తక్కువ వర్షపాతం, పొడి వాతావరణ పరిస్థితుల్లో మల్లె సాగును ప్రోత్సహించడం వల్ల రైతు తలసరి ఆదాయం పెరుగుతుందన్నారు. అలాగే నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో టొమాటో, ఉల్లిపాయలను ప్రోత్సహించవచ్చన్నారు. ఈ సంవత్సరం 'ఎల్ నినో' ప్రభావం ఎక్కువగా ఉంటుంది కాబట్టి, వర్షాధారిత ప్రాంతాల్లో ఈ పంటలు వేయవద్దన్నారు. ఈ విధంగా ఆలోచన చేసి వ్యూహాత్మకంగా ప్లాన్ చేసుకోవాలన్నారు. అగ్రికల్చర్ కి సంబంధించి జిల్లాలో ప్రధానంగా పత్తి, కందులు, శనగలు, మొక్కజొన్న వంటి మేజర్ పంటలు ఉన్నాయన్నారు. ఇవే కాకుండా పశు సంవర్ధక శాఖ కు సంబంధించి గుడ్ల ఉత్పత్తి పర్వాలేదని, మాంసం ఉత్పత్తిలో మనం టాప్ జిల్లాల్లో ఒకటిగా ఉన్నామన్నారు. పాల ఉత్పత్తిలో మాత్రం చాలా వెనుకబడి ఉన్నామన్నారు. ఉత్పత్తిని పెంచడానికి మనం ప్రస్తుతం ఆడ దూడల ఉత్పత్తిపై దృష్టి పెడుతున్నామన్నారు. దీని కోసం శాస్త్రవేత్తలు 'సెక్స్ సార్టెడ్ సీమెన్' అనే విధానాన్ని ఉపయోగిస్తున్నారన్నారు. దీని వల్ల భవిష్యత్తులో పాలు మరియు ఇతర ఉత్పత్తుల దిగుబడి పెరిగే అవకాశం ఉందన్నారు. అటవీ, మత్స్య సంపద రంగాలు మన దగ్గర చాలా తక్కువగా ఉన్నాయన్నారు.. తయారీ రంగంలో ప్రస్తుతం పెట్టుబడులు ఎక్కువగా పెడుతున్నాం కాబట్టి జిల్లా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. పరిశ్రమల రంగంలో హోటళ్లు, రవాణా, కమ్యూనికేషన్ వంటివి ముఖ్యమైనవని, వాటిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.

పి 4 కి సంబంధించి లబ్ధిదారుల కుటుంబాలను, మార్గదర్శకులను గుర్తించిన తర్వాత, లబ్ధిదారుల వ్యక్తిగత అవసరాలైన ఉద్యోగం, నైపుణ్యం, ఇల్లు లేదా ఇంటర్నెట్ కనెక్షన్ లాంటివి గుర్తించాలన్నారు. ఆ కుటుంబాల తలసరి ఆదాయాన్ని పెంచడానికి ఈ గుర్తింపు చాలా ముఖ్యమన్నారు. ఇందుకు గాను మార్గదర్శకులను గుర్తించడంలో పురోగతి తీసుకొని రావాలన్నారు. ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకొని మార్గదర్శకులను గుర్తించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

మార్చి 30వ తేదీన జిల్లా ఇన్చార్జ్ మంత్రి, పరిశ్రమల శాఖ మంత్రి సమక్షంలో జిల్లా స్థాయిలో 'బడ్జెట్ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్' నిర్వహిస్తున్నామన్నారు. తదనంతరం స్పెషల్ ఆఫీసర్లు తమ నియోజకవర్గాల్లో ప్రజా ప్రతినిధులతో చర్చించి, బడ్జెట్ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్ ను ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా మార్చి 30 వ తేది రాష్ట్ర స్థాయి పి 4 కార్యక్రమం మధ్యాహ్నం 4:20 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. దీనికి అనుగుణంగా జిల్లా స్థాయి కార్యక్రమాన్ని మధ్యాహ్నం 2:30 గంటలకు ప్రారంభించాలన్నారు. ప్రజా ప్రతినిధులను ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వానించాలన్నారు.

కార్యక్రమంలో సిపిఓ భారతి, నియోజకవర్గ స్పెషల్ అధికారులు హౌసింగ్ పిడి చిరంజీవి, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి, డీఆర్డీఏ పిడి రమణ రెడ్డి, డిపిఓ భాస్కర్, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, ఆదోని ఇంచార్జి సబ్ కలెక్టర్ అజయ్, మంత్రాలయం టీడీపీ పార్టీ ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి, ఆలూరు టీడీపీ పార్టీ ఇంచార్జి వైకుంఠం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతీ పుత్రులు పద్మశ్రీ డాక్టర్ పుట్టపర్తి నారాయణాచార్యులు.

## జిల్లా రెవెన్యూ అధికారి సి.వెంకటనారాయణమ్మ.

**ఆంధ్ర ప్రగతి కర్నూలు , మార్చి 28:**
సరస్వతీ పుత్రులు పద్మశ్రీ డాక్టర్ పుట్టపర్తి నారాయణాచార్యులు అని జిల్లా రెవెన్యూ అధికారి సి.వెంకట నారాయణమ్మ ఆయన జన్మదిన సందర్భంగా పేర్కొన్నారు. శనివారం ఉదయం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో పుట్టపర్తి నారాయణాచార్యుల జన్మదిన వేడుకలలో జిల్లా రెవెన్యూ అధికారి సి.వెంకట నారాయణమ్మ పాల్గొని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ...పుట్టపర్తి నారాయణాచార్యులు కవిగా, పండితునిగా, అవధానిగా, విమర్శకునిగా, వ్యాఖ్యాతగా, వక్తగా, అనువాదకునిగా, వాగ్గేయకారునిగా అనేక సాహిత్య ప్రక్రియలలో గొప్ప పాత్ర పోషించారు. తెలుగు సాహితీ జగత్తులో ఒక తారాజువ్వలాంటివారు. తెలుగు సాహిత్యం గర్వించదగ్గ మహోన్నత సాహితీ శిఖరం పుట్టపర్తి నారాయణాచార్యులు. అందుకే వారు వ్రాసిన రచన " శివతాండవం " లో పదాలు శివతాండవంలా ఉంటాయని , భావం శివుని సుందర లాస్యంగా ఉంటుందని ఆ




కాలంలో అందరూ కొనియాడారని తెలిపారు.

హృషికేశ్ లో నారాయణ ఆచార్యులను స్వామి శివానంద సరస్వతి "సరస్వతీ పుత్ర" అనే బిరుదును ప్రసాదించారు. భారత ప్రభుత్వం వీరిని "పద్మశ్రీ" బిరుదుతో సత్కరించి గౌరవించింది. ఎన్నో విశ్వవిద్యాలయాలు వీరిని గౌరవ డాక్టరేట్ తో సత్కరించాయి అని డిఆర్ఓ తెలియజేశారు. ఈ సందర్భంగా సీఈవో సెట్ కూర్ వేణుగోపాల్ మాట్లాడుతూ...

పుట్టపర్తి నారాయణాచార్యులు 1914 మార్చి 28 వ తేదీ నాడు అనంతపురం వద్ద గల చియ్యేడు అనే గ్రామంలో జన్మించారు అని చిన్న తనంలోనే రామాయణ, భాగవత, భారత ఇతిహాసాలను ఆకళింపు చేసుకున్నారు , సంగీతం, భరత నాట్యం నేర్చుకొని నాటకాలలో స్త్రీ పాత్రలు పోషించారు అని


12 సంవత్సరాల వయస్సు లోనే "పెనుగొండ లక్ష్మి" అనే పద్య కావ్యం రచించారు. 15 భాషలను నేర్చుకోవడమే కాకుండా వాటన్నింటిలో పాండిత్యాన్ని పొందారు , బహుభాషా కోవిదుడు, సరస్వతీ పుత్రుడు పుట్టపర్తి నారాయణాచార్యులు.

వారు వ్రాసిన "శివ తాండవం" ప్రాఖ్యాతి గాంచింది అని తెలిపారు. ఈ జిల్లా టూరిజం అధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... తెలుగులో వీరు వ్రాసిన కొన్ని ముఖ్యమైన గ్రంధాలు, పెనుగొండ లక్ష్మి, మేఘదూతం, షాజీ, గాంధీ ప్రస్థానం, క్రాంతి సందేశం మొదలైనవి అని, సంస్కృతంలో వీరు వ్రాసిన "త్యాగ రాజ స్వామి సుప్రభాతం" చాలా ప్రసిద్ధి చెందింది అని, ఆంగ్లంలో "లీవ్ ఇన్ ది విండ్", "ది హీరో" వంటివి ప్రఖ్యాతి చెందినవి. పర్షియన్ భాషలో కూడా వీరికి చక్కని ప్రావీణ్యముంది అని కడపలో శ్రీ రామకృష్ణా హైస్కూల్ లో తెలుగు పండిట్ గా పనిచేసి పదవీ విరమణ పొందారు అని తెలియజేశారు

ఈ సమావేశానికి కలెక్టరేట్ , సెట్ కూర్ , టూరిజం శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# నల్లమల అడవిలో చెలరేగుతున్న మంటలు.





**ఆంధ్ర ప్రగతి మహానంది, మార్చి 28:**మహానంది పుణ్యక్షేత్రం ఆవరణలో గత కొద్ది రోజుల క్రితం అడవిలో నామాల తిప్పకు మంటలు ఎగిసిపడడంతో అధికార యంత్రాంగం కదిలి మంటలను అదుపులోకి తెచ్చిన విషయం తెలిసిందే. అయితే నేడు తాజాగా ఆలయ పరిపాలన భవనం వెనుక ఉన్నటువంటి తాటిమాను తీప్పకు మంటలు పెద్ద ఎత్తున ఎగసిపడుతుండడం చూసి భక్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఓ పక్క వన్యప్రాణుల అరుపులు వినిపిస్తున్నాయని స్థానికులు, భక్తులు చర్చించుకుంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నల్లమల అడవిలో ఎగసిపడుతున్న మంటలను ఆర్పివేయాలని కోరుతున్నారు.

# బండ లాగుడు పోటీలతో రైతుల్లో నూతనోత్సాహం.-బిసి రాజారెడ్డి

**- పసుపలలో శ్రీరామనవమి ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరైన బిసి రాజారెడ్డి**

**- బండలాగుడు పోటీలు ప్రారంభించిన బిసి రాజారెడ్డి**

**ఆంధ్ర ప్రగతి బనగానపల్లె మార్చి 28:**
బండ లాగుడు పోటీలతో రైతుల్లో నూతనోత్సాహం నెలకొంటుందని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి అన్నారు. మండలంలోని పసుపల గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీరామ నవమి ఉత్సవాలకు బిసి రాజారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పసుపల చేరుకున్న బిసి రాజారెడ్డికి టీడీపీ నాయకులు భూషన్న, బాలనాయుడు, షేక్షావలి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలను బిసి రాజారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా బిసి రాజారెడ్డి మాట్లాడుతూ... గ్రామాల్లో రైతు సంబరాలను ఏర్పాటు చేయడం వల్ల రైతుల్లో నూతనోత్సాహం, ఐకమత్యం పెంపొందుతాయన్నారు. బండలాగుడు పోటీలు వృషభరాజముల పౌరుషానికి ప్రతీక అన్నారు. మన రాయలసీమ ప్రాంతంలో రైతు సంబరాల్లో భాగంగా ఏర్పాటు చేసే బండలాగుడు పోటీలను తిలకించేందుకు రైతులు, గ్రామీణ ప్రజలు ఎంతో



ఆసక్తి కనబరుస్తారన్నారు. శ్రీరామ నవమి సందర్భంగా ఈ పోటీలు ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. బండలాగుడు పోటీలో మొత్తం 17 ఎడ్ల జతలు పాల్గొన్నాన్నాయి. ఆయా ఎడ్ల జతల మధ్య హోరాహోరీగా బండలగుడు పోటీలు సాగుతున్నాయి. విజేతలుగా నిలిచిన వృషభ రాజముల యజమానులకు మొదటి బహుమతి కింద రూ.50,000 , రెండో బహుమతి రూ.40,000, మూడో బహుమతి రూ.30,000, నాలుగో బహుమతి రూ.20000, ఐదవ బహుమతి రూ.10000 చొప్పున అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులు తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

**రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జర్నలిస్టులకు వైద్య శిబిరాలు. -జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**







**ఆంధ్ర ప్రగతి కర్నూలు, మార్చి 28:** సమాజానికి సమాచారాన్ని చేరవేసే జర్నలిస్టులు తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సూచించారు. శనివారం కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సమాచార శాఖ కార్యాలయం ఆవరణ లో నిర్వహించిన జర్నలిస్టుల మెడికల్ క్యాంప్ ను కలెక్టర్ సందర్శించారు. మెడికల్ క్యాంప్ లో జర్నలిస్టుల కు వైద్య పరీక్షల్లో భాగంగా రక్తపోటు (బీపీ), రక్తంలో చక్కెర స్థాయి (షుగర్), ఈసీజీ, 2డీ ఎకో, సీరం క్రియాటినిన్ వంటి ముఖ్యమైన పరీక్షలను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జర్నలిస్టులకు వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. నిత్యం పని ఒత్తిడితో ఉండే జర్నలిస్టులకు ఆరోగ్య పరీక్షలు అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు.. ప్రభుత్వం నిర్వహించే మెడికల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ జయమ్మ, కిమ్స్ వైద్యులు డా.ఎస్.భాను, డా.మహమ్మద్ నిహాల్, సీనియర్ మార్కెటింగ్ మేనేజర్ లు, కె.ఎం.బాషా, ఆనంద్ కుమార్, పెద్ద సంఖ్యలో జర్నలిస్టు లు పాల్గొన్నారు.



# పెండింగ్ మ్యుటేషన్ల క్లియరెన్స్‌కు చర్యలు అవసరం.

**సేవలలో పారదర్శకతతో ప్రజల సంతృప్తి పెంపు.**

**భూసంబంధిత సమస్యల పరిష్కారంపై దృష్టి.**

**జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**

**ఆంధ్ర ప్రగతి మహానంది మార్చి 28:**
జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ అంశాలను వేగవంతంగా పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో మండల తాసిల్దార్లు, రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, డిఆర్ఓ రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఎస్ ఎల్ ఏ గడువు దాటి పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్లను ప్రాధాన్యంగా తీసుకుని వారం రోజుల్లోగా పూర్తిచేయాలని ఆర్డీవోలు మండల తాసిల్దార్లనుఆదేశించారు. జిల్లాలోని బనగానపల్లె డివిజన్‌లో 66, డోన్‌లో 21, ఆత్మకూరు డివిజన్‌లో 172, నంద్యాల డివిజన్‌లో 227 మ్యుటేషన్లు ఎస్ ఎల్ ఏ గడువు దాటి పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంటూ, వీటిని త్వరితగతిన క్లియర్ చేయాలని ఆదేశించారు. టెక్నికల్ సమస్యలు ఉన్న




మ్యుటేషన్లను కూడా పరిష్కార మార్గాలు కనుగొని పూర్తి చేయాలని, అభ్యంతరాలు ఉన్న దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి అవసరమైతే తిరస్కరించాలని తెలిపారు. పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ ప్రక్రియలో భాగంగా బనగానపల్లె డివిజన్‌లో 26 గ్రామాలు, డోన్‌లో 7, ఆత్మకూరులో 41, నంద్యాలలో 38 గ్రామాలు కలిపి మొత్తం 112 గ్రామాల్లో ఈ-కేవైసీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి పంపిణీకి చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే రీసర్వేకు సంబంధించిన పెండింగ్ అంశాలను కూడా వేగంగా పరిష్కరించి ప్రజల సంతృప్తి పెంచాలన్నారు. కొత్తబురుజు గ్రామంలో నెల వ్యవధిలో 74 పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేయాలని సీఎం లక్ష్యాన్ని నిర్ధేశించినట్లు తెలిపారు. ఈ విషయంపై డోన్ తహసీల్దార్‌ను ప్రశ్నించగా, ప్రస్తుతం 27 సర్వీసింగ్ అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియను ఏప్రిల్ 9వ తేదీలోగా పరిష్కరించాలన్నారు.

జిల్లాలో కుల ధృవీకరణ పత్రాల కోసం మొత్తం 7,07,462 దరఖాస్తులు అందగా, 2,71,039 ఆమోదించబడ్డాయని, మిగిలిన 4,36,423 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. వీటిలో గణనీయమైన సంఖ్యలో కేసులు కేవలం పర్యవేక్షణ లోపం వల్ల నిలిచిపోయాయని పేర్కొన్నారు. నంద్యాల జిల్లాలో మాత్రమే 15,500కు పైగా దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. సుమారు 1,28,000 మంది వలస కార్మికులకు సంబంధించిన వివరాల సేకరణలో ఇబ్బందులు ఉన్నాయని గుర్తించి, దీనికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. తిరస్కరించబడిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పునఃపరిశీలించి అర్హులకు న్యాయం చేయాలి. హౌస్‌హోల్డ్ మ్యాపింగ్, డేటా ఎంట్రీలో జరిగిన పొరపాట్లను వెంటనే సరిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. స్కూళ్లు, కళాశాలలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా ధృవీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి. ప్రజలకు పారదర్శక, వేగవంతమైన సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

# విద్యార్థులకు అవగాహన కల్పించిన శక్తి టీం సభ్యులు.



**ఆంధ్ర ప్రగతి మహానంది మార్చి 28:** నంద్యాల సబ్ డివిజన్ శక్తి టీం సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ డిఎన్ ప్రసాద్ వెంకటేశ్వర్లు రఫీ మహిళా పోలీస్ లక్ష్మీదేవి అయిన మేము ఎస్పీ ఆదేశాల మేరకుఏ ఎస్ పి ఉత్తర్వుల మేరకు మహానంది మండలం అల్లినగరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల యందు ఉన్న 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు విద్యార్థినులకు ఎమర్జెన్సీ కాల్ 112 గురించి నో టచ్ గురించి వివరించి గుర్తుతెలియని వ్యక్తులతో అమ్మాయిలు జాగ్రత్తగా ఉండవలెనని వారు ఏదైనా తిను వస్తువులు ఇచ్చిన అమ్మాయిలు తినరాదని చెప్పి తెలిసినవ్యక్తులు గాని తెలియని వ్యక్తులుగాని అమ్మాయిల పట్ల చెడుగా ప్రవర్తించినచో తల్లిదండ్రులకు గాని టీచర్లకు గానీ తెలుపవలయునని లేదా 112 కు ఫోన్ చేయవలెనని చెప్పి ఎవరైనా అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించినచో పోలీసులకు సమాచారం అందించ వలయునని తెలిపి అక్కడ ఉన్న టీచర్లకు శక్తి ఆప్ గురించి వివరించి శక్తి యాప్ డౌన్లోడ్ చేయించి అవేర్నెస్ ప్రోగ్రాం చేయడమైనది.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# పరిశుభ్రత మన ఇంటి నుండే మొదలవ్వాలి

## ..జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.






**ఆంధ్ర ప్రగతి కర్నూలు, మార్చి 28:**
పరిశుభ్రత మన ఇంటి నుండే ప్రారంభం కావాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి విద్యార్థులకు అవగాహన కల్పించారు. శనివారం 'స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా సెయింట్ జోసెఫ్ కళాశాల లో "జీరో వేస్ట్ ఇన్స్టిట్యూషన్స్" అంశంపై పొడి వ్యర్థాలు, తడి వ్యర్థాలు, పారిశుధ్య వ్యర్థాలు, ప్రత్యేక సంరక్షణ వ్యర్థాల విభజన తో పాటు పలు అంశాలపై కలెక్టర్ విద్యార్థులకు అవగాహన నిర్వహించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముందుగా పరిశుభ్రత మన ఇంటి నుండే మొదలు కావాలని, ప్రతి ఒక్కరూ వారి వారి ఇళ్లలో తడి, పొడి చెత్తను వేరు చేసుకోవాలన్నారు. వేరు చేసిన తడి,పొడి చెత్తను పారిశుధ్య సిబ్బంది ఇంటి వద్దకు ఇచ్చినపుడు ఇవ్వాలని, చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చూడాలన్నారు. తడి, పొడి చెత్తను సేకరించిన తర్వాత, దానిని ప్రాసెస్ చేయాల్సిన బాధ్యత అధికారుల మీద ఉంటుందన్నారు. ఇక్కడ హాజరైన విద్యార్థులందరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. భూగర్భ జల మట్టం చాలా తగ్గిపోతోందని, ఉత్తర కోస్తా ప్రాంతంలో 8 మీటర్ల లోతులోనే నీళ్లు పడతాయని, కానీ ఇక్కడ 24 మీటర్ల లోతుకు వెళ్లాల్సి వస్తోందన్నారు. అందువల్ల నీటిని పొదుపు చేయడం మన బాధ్యత అన్నారు. ఈ ఏడాది జిల్లాలో 45 లక్షల మొక్కలు నాటాలని నాటాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నామన్నారు. ఇందుకోసం నర్సరీలను కూడా సిద్ధం చేశామన్నారు. ప్రతి ఒక్కరికీ ఈ జూన్ నెలలో ఒక మొక్క నాటమని ఇతరులకు చెప్పాలని, మీరు కూడా తప్పకుండా ఒక మొక్క నాటాలన్నారు. బయట రెస్టారెంట్ లలో, స్ట్రీట్ ఫుడ్, హోమ్ డెలివరీ యాప్స్ ద్వారా వచ్చే ఆహారం తాజాగా ఉండదని, వాటిని రోజుల తరబడి ఫ్రీజర్‌లో నిల్వ ఉంచి, ప్రిజర్వేటివ్స్, రంగులు కలిపి విక్రయిస్తారని ఇలాంటి ఆహారపు అలవాట్ల వల్ల క్యాన్సర్ మరియు డయాబెటిస్ వంటి వ్యాధులు సమాజంలో విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. సాధ్యమైనంత వరకు ఇంట్లో వండుకున్న ఆహారాన్నే తినాలని, బయట ఫుడ్ ఎప్పుడో ఒకసారి తింటే పర్వాలేదు కానీ క్రమం తప్పకుండా తినడం చాలా ప్రమాదకరమని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు.మొబైల్, ఇంటర్నెట్ మరియు సోషల్ మీడియా ప్రజల సంక్షేమం కోసం ఉద్దేశించబడ్డాయన్నారు. వాటిని సరైన పద్ధతిలో ఉపయోగిస్తే అద్భుతమైన ఫలితాలు ఉంటాయన్నారు.. జీవితంలో ఆర్థిక ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలు లేదా కుటుంబ సమస్యలు వంటి ఎన్నో అడ్డంకులు ఎదురుకావచ్చుని, అయినప్పటికీ, మనకంటూ ఒక స్పష్టమైన లక్ష్యం ఉండాలన్నారు. సంబంధిత లక్ష్యాన్ని సాధించే విధంగా విద్యార్థులు కృషి చేయాలన్నారు. పాజిటివ్ థింకింగ్ మరియు హార్డ్ వర్క్ ఈ రెండూ ఉంటే మీరు ఖచ్చితంగా విజయం సాధిస్తారన్నారు.
జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 'స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర' అనే కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. పరిశుభ్రత యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు వివరించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. "దేశం మీ కోసం ఏమి చేస్తుందని కాదు, దేశం కోసం మీరు ఏమి చేయగలరో ఆలోచించండి." అని 1961లో జాన్ ఎఫ్.కెన్నెడీ చెప్పిన ప్రసిద్ధ వాక్యాన్ని జేసి గుర్తు చేశారు. అభివృద్ధి చెందిన దేశాలలో పౌరులే తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకునే బాధ్యతను తీసుకుంటారన్నారు. ప్రభుత్వం రోడ్లను శుభ్రం చేయగలదని, కానీ దేశం మొత్తం పరిశుభ్రంగా ఉండాలంటే అది పౌరుల బాధ్యత అన్నారు. గత 20 ఏళ్లలో విద్యా రంగం పూర్తిగా మారిపోయిందన్నారు. ఒకప్పుడు విద్యా వనరులు (మంచి సంస్థలు, మెంటార్లు, స్టడీ మెటీరియల్స్) కేవలం బెంగళూరు, ఢిల్లీ, ముంబై, హైదరాబాద్ వంటి పెద్ద నగరాలకే పరిమితమై ఉండేవన్నారు. 20 ఏళ్ల క్రితం ఐఐటి , ఎయిమ్స్ వంటి పెద్ద కాలేజీల సెలక్షన్ లిస్ట్ చూస్తే, కేవలం పెద్ద నగరాల విద్యార్థులే ఉండేవారన్నారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయిందన్నారు. చిన్న పట్టణాలు మరియు గ్రామాల విద్యార్థులకు కూడా అన్ని వనరులు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఒకప్పుడు కేవలం పెద్ద నగరాల్లో లేదా కాలేజీల్లో మాత్రమే దొరికే స్టడీ మెటీరియల్ మరియు మెంటార్‌షిప్ ఇప్పుడు మొబైల్ మరియు ఇంటర్నెట్ ద్వారా అందరికీ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. తాను ఢిల్లీలోని ఒక సాధారణ కాలేజీలో చదివినప్పటికీ, పూర్తిస్థాయి ఉద్యోగం చేస్తూ కేవలం మొబైల్ మరియు ఇంటర్నెట్ సహాయంతో చదివి విజయం సాధించానన్నారు. "నా దగ్గర వనరులు లేవు", "నేను చిన్న కుటుంబం నుండి వచ్చాను", "నాకు మంచి గైడెన్స్ లేదు" అనేవన్నీ కేవలం సాకులు మాత్రమేనని జేసి స్పష్టం చేశారు. ఆయన చాలా వెనుకబడిన ప్రాంతం మరియు భిన్నమైన సంస్కృతి నుండి వచ్చినప్పటికీ, ఈరోజు ఇంతమంది ముందు నిలబడి మాట్లాడుతున్నారంటే దానికి కారణం విద్య ఇచ్చిన శక్తి అని పేర్కొన్నారు. మీలో గనుక పట్టుదల, సాధించాలనే తపన ఉంటే, మిమ్మల్ని ఎవరూ ఆపలేరని జేసి విద్యార్థులకు సూచించారు.కార్యక్రమంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల అకడమిక్ డైరెక్టర్, ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

## నంద్యాలలో హజ్ యాత్రికుల రెండో విడత శిక్షణ తరగతులు ప్రారంభం

**ముఖ్య అతిథిగా హాజరైన టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్.**

**యాత్రికులకు దిశానిర్దేశం చేసిన ముఫ్తీ షాజహాన్, డాక్టర్ ఎస్. ఇంతియాజ్ అహ్మద్.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మార్చి 28:**
నంద్యాల పట్టణంలోని ఆర్కే ఫంక్షన్ హాల్ నందు 2026-2027 సంవత్సరానికి గాను హజ్ యాత్రకు ఎంపికైన భక్తుల కోసం రెండవ విడత శిక్షణ తరగతులను శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ ముఖ్య అతిథిగా విచ్చేసి శిక్షణను ప్రారంభించారు. శిక్షణ తరగతుల్లో భాగంగా ముఫ్తీ షాజహాన్ హజ్ యాత్రికులకు వస్త్రధారణ (ఇహ్రామ్), పాటించాల్సిన నియమ నిబంధనలు మరియు యాత్రలో అనుసరించాల్సిన పద్ధతులపై విపులంగా వివరించారు. భక్తులకు అర్థమయ్యే రీతిలో ప్రత్యక్షంగా చేసి చూపిస్తూ అద్భుతంగా బోధించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ హజ్ యాత్ర అనేది ప్రతి ముస్లిం జీవితంలో ఒక అత్యున్నతమైన మరియు పవిత్రమైన ఘట్టమని తెలిపారు. అల్లాహ్ పిలుపు మేరకు హజ్ యాత్రకు ఎంపికైన నంద్యాల నియోజకవర్గ భక్తులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. హజ్ యాత్రలో పాటించాల్సిన నియమ నిబంధనలు క్లిష్టంగా ఉంటాయని, అందుకే ఇక్కడ ఇచ్చే శిక్షణ తరగతులను ప్రతి యాత్రికుడు క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలని సూచించారు. సరైన అవగాహన ఉంటేనే అక్కడ ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రార్థనలు పూర్తి చేసుకోగలరని తెలిపారు. యాత్ర సమయంలో క్రమశిక్షణతో ఉండి, మన దేశ గౌరవాన్ని కాపాడాలని కోరారు. పవిత్ర మక్కా, మదీనా సందర్శన సమయంలో దేశం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ప్రత్యేక ప్రార్థనలు చేయాలని యాత్రికులను కోరారు. హజ్ యాత్రికులకు అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు ప్రభుత్వం మరియు పార్టీ పరంగా ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నేషనల్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎస్. ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ హజ్ యాత్రికుల సందేహాలకు తగిన సమాధానాలు ఇచ్చారు. విమానం ఎక్కినప్పటి నుండి యాత్ర పూర్తి చేసుకుని తిరిగి వచ్చే వరకు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా వివరించారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల (ఇరాన్-ఇజ్రాయిల్-అమెరికా ఉద్రిక్తతలు) నేపథ్యంలో, అల్లాహ్ కరుణాకటాక్షాలతో యాత్రికులందరూ సురక్షితంగా హజ్ యాత్ర పూర్తి చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ విద్యాసంస్థల పరిపాలన అధికారి రఫీ అహ్మద్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మునియార్ ఖలీల్ అహ్మద్, అబ్దుల్ హాజీ మౌలానా, ముల్లా మహబూబ్ బాషా, రషీద్, హజ్ కమిటీ సభ్యులు, ఆర్కే ఫంక్షన్ హాల్ యాజమాన్యం మరియు స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

## జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ను కలిసిన రైతు సంఘం ప్రతినిధి బృందం.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మార్చి 28:**నంద్యాల జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాకు 2,400 రూపాయల ప్రకారం ప్రభుత్వమే రైతుల వద్ద ఉన్న మొత్తం మొక్కజొన్నలను కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ను కోరింది. ఈ మేరకు శనివారం నంద్యాల జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఏ.రాజశేఖర్, జిల్లా కార్యదర్శి టి. రామ చంద్రుడు, జిల్లా సహాయ కార్యదర్శి ఏ .సురేష్, జిల్లా నాయకులు జి .శ్రీనివాసరెడ్డి ల ప్రతినిధి బృందం కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏ.రాజశేఖర్, టి. రామ చంద్రుడు లు కలెక్టర్ తో మాట్లాడుతూ.. ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్లో లక్షలాది ఎకరాల్లో మొక్కజొన్న వేసిన రైతాంగం అధిక వర్షాలకు తగ్గిన దిగుబడి వల్ల సకాలంలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం, మధ్య దళారులు అతి తక్కువ ధరకు కొనుగోలు చేయడం మూలంగా తీవ్రంగా నష్టపోయారన్నారు.కనీసం రబీ సీజన్లోనైనా పండించుకుని అప్పుల బాధ నుండి విముక్తి చెందుదామని ఆశతో లక్షన్నర ఎకరాలకు పైగా జిల్లా వ్యాప్తంగా మొక్కజొన్న సాగు చేస్తే, ఎకరాకు 40,000 వరకు పెట్టుబడి పెట్టగా, దిగుబడి మాత్రం ఎకరాకు 30 కింటాల వరకు వచ్చిన , మధ్య దళారులు సిండికేట్ గా ఏర్పడి క్వింటా కేవలం 1600 నుండి 1700 రూపాయలకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా జిల్లాల్లో మొక్కజొన్న పంట వేసిన ప్రతి రైతు ఎకరాకు 20 నుండి 25 వేల రూపాయల వరకు నష్టపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మద్దతు ధరల చట్టాలు చేయడం తప్ప ఆచరణలో ఆ చట్టాలను అమలు చేయడం లో నిర్లక్ష్యం వహిస్తున్నాయి. ఫలితంగా క్వింటా 2400 రూపాయలకు అమ్ముకోవాల్సిన రైతులు ప్రైవేట్ వ్యాపారస్తుల దయదక్షిణ్యాలపైఆధారపడి పంటలు అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా జిల్లా వ్యాప్తంగా రైతాంగం తీవ్రమైన అప్పుల ఊబిలో కూరుకుపోయి, వడ్డీ వ్యాపారస్తుల ఒత్తిడీలు తట్టుకోలేక అవమానులతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఓట్లు వేయించుకొని గద్దెనెక్కిన ప్రభుత్వాలు రైతాంగం వాడే విత్తనాలు, ఎరువులు ,పురుగుల మందులు ధరలు విపరీతంగా పెంచడం తప్ప, తాము ప్రకటించిన మద్దతు ధరల చట్టాలను సకాలంలో అమలు చేయాలనే ఆలోచన, శ్రద్ధ పెట్టడం లేదన్నారు. కావున ప్రభుత్వాల నిర్లక్ష్యం మూలంగానే రైకాంగం ఆత్మహత్యలు రోజురోజుకు జిల్లాల్లో పెరిగిపోతున్నవి. కావున జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని మార్క్ ఫెడ్ సంస్థ ద్వారా రైతుల వద్ద ఉన్న మొత్తం మొక్కజొన్నలను ప్రభుత్వమే 2400ప్రకారం వెంటనే కొనుగోలు చేయాలని కోరారు.
**ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా జిల్లా కలెక్టర్ :** స్పందించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా రైతు సంఘం నాయకులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దృష్టిలో ఉందని, అయినప్పటికీ సమస్యను మరోసారి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

## జిల్లాలో జీరో వేస్ట్ ఇనిస్టిట్యూషన్స్‌కు శ్రీకారం.

**ప్రభుత్వ సంస్థల్లో చెత్త నిర్వహణకు సమగ్ర కార్యాచరణ ప్రారంభం.**

**40 రోజుల్లో చెత్త రహిత సంస్థల లక్ష్యం. -జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి గణియా.**







**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మార్చి 28:**
రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నంద్యాల జిల్లాలో "జీరో వేస్ట్ ఇనిస్టిట్యూషన్స్" (చెత్త రహిత సంస్థలు) కార్యక్రమాన్ని సమగ్రంగా అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నంద్యాల పట్టణంలోని దేవనగర్‌లో "జీరో వేస్ట్ ఇన్స్టిట్యూషన్ " థీమ్‌తో నిర్వహించిన అవగాహన ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. పురపాలక ప్రాథమిక పాఠశాల వరకు సాగిన ఈ ర్యాలీలో కలెక్టర్ స్వయంగా పాల్గొని పరిశుభ్రత ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కంపోస్ట్ పిట్‌ను ప్రారంభించి, దాని నిర్వహణపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ద్వారా జిల్లాలోని అన్ని ప్రభుత్వ సంస్థల్లో చెత్త నిర్వహణను శాస్త్రీయంగా, క్రమబద్ధంగా అమలు చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని 1363 ప్రభుత్వ పాఠశాలలు, 1663 అంగన్‌వాడీ కేంద్రాలు, 153 సంక్షేమ వసతి గృహాలతో సహా సహా గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ఉన్న అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ఈ కార్యక్రమంలో చేర్చినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి సంస్థలో మూడు రకాల డస్ట్‌బిన్‌ల ద్వారా చెత్తను వేర్వేరుగా సేకరించడం జరుగుతోందన్నారు. తడి చెత్తను కంపోస్ట్ పిట్‌లలో ఎరువుగా మార్చడం, పొడి చెత్తను వేరు చేసి విక్రయించడం ద్వారా ఆదాయం పొందవచ్చన్నారు. ప్రమాదకర చెత్తను సురక్షితంగా మున్సిపాలిటీ/పంచాయతీకి అప్పగించేలా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ వివరించారు.
పాఠశాలల్లో విద్యార్థులకు చెత్త విభజన, ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు, ఇంటి వద్ద కంపోస్టింగ్ విధానాలపై అవగాహన కల్పిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామీణ స్థాయిలో ఉపాధి హామీ పథకం మరియు స్వయం సహాయక బృందాల ద్వారా కంపోస్ట్ తయారీని ప్రోత్సహిస్తూ, కిచెన్ గార్డెన్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని 4045 రోజులలో పూర్తి చేయాలని లక్ష్యంగా




పెట్టుకుని, సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని ప్రభుత్వ సంస్థలు పరిశుభ్రంగా, పర్యావరణ అనుకూలంగా మారడమే కాకుండా ప్రజల్లో కూడా బాధ్యతాయుతమైన చెత్త నిర్వహణపై అవగాహన పెరుగుతుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ శేషన్న సంబంధిత అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఏపీఎస్పీలో 300 హెడ్ కానిస్టేబుల్ పోస్టుల అప్‌గ్రేడ్..

### ప్రభుత్వ ఉత్తర్వుల జారీ

ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ (ఏపీఎస్పీ) విభాగంలో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుళ్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఏపీఎస్పీలోని 300 హెడ్ కానిస్టేబుల్ (హెచ్‌సీ) పోస్టులను అసిస్టెంట్ రిజర్వ్ సబ్-ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (ఏఆర్ఎస్ఐ) పోస్టులుగా అప్‌గ్రేడ్ చేస్తూ హోం శాఖ నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జీవో ఎంఎస్ నెం. 62ను విడుదల చేసింది. ప్రభుత్వ నిర్ణయంతో 8 ఏపీఎస్పీ బెటాలియన్ల పరిధిలో ఈ మార్పులు చోటుచేసుకోనున్నాయి. అప్‌గ్రేడ్ చేసిన 300 ఏఆర్ఎస్ఐ పోస్టులకు బదులుగా, అంతే సంఖ్యలో హెడ్ కానిస్టేబుల్ పోస్టులను రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. కర్నూలు (2వ బెటాలియన్), కాకినాడ (3వ), విజయనగరం (5వ), మంగళగిరి (6వ) బెటాలియన్లలో ఒక్కొక్కదానికి 42 చొప్పున పోస్టులను కేటాయించారు. అలాగే, 9, 11, 14, 16వ బెటాలియన్లకు తలా 33 పోస్టులను అప్‌గ్రేడ్ చేశారు. రాష్ట్ర డీజీపీ 2025 జనవరి 31న పంపిన ప్రతిపాదనల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రతిపాదనకు 2026 మార్చి 14న రాష్ట్ర కేబినెట్, మార్చి 26న ఆర్థిక శాఖ ఆమోదం తెలిపాయి. తాజాగా హోం శాఖ తుది ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను అమలు చేసేందుకు అవసరమైన తదుపరి చర్యలు తీసుకోవాలని డీజీపీని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నిర్ణయంతో ఏపీఎస్పీ హెడ్ కానిస్టేబుళ్లకు ప్రమోషన్ అవకాశాలు మెరుగుపడనున్నాయి.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002 AND PUBLISHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

# ఆత్మగౌరవ నినాదానికి 44 వసంతాలు

## నేడు తెలుగుదేశం ఆవిర్భావ దినం




**అమరావతిమార్చి 28 ఆంధ్ర ప్రగతి**
తెలుగువారి ఆత్మగౌరవ నినాదంతో పురుడు పోసుకున్న తెలుగుదేశం పార్టీ 44 వసంతాలు పూర్తి చేసుకుంది. ఆదివారం టీడీపీ ఆవిర్భావ రోజు. 45వ ఏట అడుగు పెడుతోంది. చరిత్రలో ఒక ప్రాంతీయ పార్టీ నాలుగున్నర దశాబ్దాల ప్రయాణం అంటే.. ఓ సంచలనమే. బలమైన జాతీయ పార్టీలే కాలంతో పాటు మారలేక, కొత్త తరాన్ని ఆకట్టుకోలేక కనుమరుగైపోతున్న కాలంలో ఒక ప్రాంతీయ పార్టీ ఎన్నో ఆటుపోట్లను తట్టుకుని ఇన్నేళ్లు నిలబడటం మామూలు విషయం కాదు. అందులోనూ దాదాపు సగం కాలం అంటే.. 21 ఏళ్లపాటు ప్రతిపక్షంలోనే ఉంది. 2009 నుంచి 2014 వరకు ప్రతిపక్షంలో ఉండటం ఒక సవాల్ అయితే, 2019 నుంచి 2024 వరకు మరో సవాల్. ఆ ఐదేళ్లూ అధికారంలో ఉన్న జగన్ టీడీపీని నామరూపాల్లేకుండా చేసేందుకు చేయని ప్రయత్నాలు లేవు. చివరికి పార్టీ అధినేత చంద్రబాబును తప్పుడు కేసులో ఇరికించి తొలిసారి జైలుపాలు చేశారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులను వేధించారు. అయినా క్యాడర్ చెక్కు చెదరలేదు. సమ్మెట దెబ్బలతో రాటుతేలినట్టు మరింత ఉత్సాహంతో పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు కృషి చేశారు. అద్భుతమైన విజయం సాధించారు. 1995 సంక్షోభం మొదలు.. ఇక పార్టీ పని అయిపోయిందనుకున్న ప్రతిసారీ పార్టీని, క్యాడర్‌ను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చి పార్టీని నిలబెట్టిన ఘనత చంద్రబాబుకే దక్కుతుంది. టీడీపీ ఆవిర్భావంలోనే వైవిధ్యం ఉంది. ఆరు పదుల వయసులో ప్రాంతీయ పార్టీని స్థాపించడమే సాహసం అయితే, అప్పుడే పురుడు పోసుకున్న పార్టీలో ఉద్దండులైన రాజకీయ నాయకుల కన్నా కొత్తగా రాజకీయాల్లోకి రావాలనుకునే యువకులకు ప్రాధాన్యమిచ్చి టికెట్లు ఇవ్వడం ఎన్టీఆర్ చేసిన మరో సాహసం. అప్పటి వరకు రాజకీయం అంటే కేవలం కొన్ని సామాజికవర్గాలకే పరిమితం. కానీ ఎన్టీఆర్ రాజకీయ సమీకరణాలను మార్చేశారు. విద్యావంతులకు, దళితులకు, బీసీలకు ప్రాధాన్యమిచ్చారు. 1983లో టీడీపీ తరఫున పోటీ చేసిన అభ్యర్థుల్లో 28 మంది పోస్టు గ్రాడ్యుయేట్లు, 20 మంది వైద్యులు, 47 మంది న్యాయవాదులు, 8 మంది ఇంజనీర్లు, 128 మంది పట్టభద్రులు ఉన్నారు. రాజకీయాల్లో విద్యావంతులు, దళితులు, వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యం దక్కింది టీడీపీ ఆవిర్భావం తర్వాతే.

### అభిమానులకు అగ్రతాంబూలం

అప్పట్లో ఎన్టీఆర్ తన అభిమానులకూ తగిన ప్రాధాన్యమిచ్చారు. 1983 ఎన్నికల్లో గుంటూరు-1 అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసిన ఉమర్‌ఖాన్ పటాన్(బుడేఖాన్) ఎన్టీఆర్‌కు వీరాభిమాని. ఆయన ఎన్నికల ఖర్చు కోసం ఇంటిని తాకట్టు పెట్టి మరీ డబ్బులు తెచ్చుకున్నారు. ఆయనతోపాటు ముషీరాబాద్ నుంచి పోటీ చేసిన శ్రీపతిరాజేశ్వర్ వంటి అభిమాన సంఘ నాయకులు చాలా మందే ఉన్నారు. ఆ ఎన్నికల్లో వీరంతా గెలిచారు.

### అట్టహాసంగా ఏర్పాట్లు

తెలుగువారి ఆత్మగౌరవం కోసం.. అణగారిన వర్గాలకు అండగా నిలవడం కోసం.. ఆవిర్భవించిన టీడీపీ 45వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా పసుపుదళంలో ఉత్సాహం పరవళ్లు తొక్కుతోంది. టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేశారు. పార్టీ అధినేత చంద్రబాబు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారు.

### విప్లవాత్మక మార్పులకు నాంది

టీడీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్ర రాజకీయాల్లో ఎన్నో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్టీఆర్ చేసిన మొదటి పని.. ఎమ్మెల్యేలకు ప్రవర్తనా నియమావళిని రూపొందించడం. ఎమ్మెల్యేలు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, ఉద్యోగుల బదిలీలు, నియామకాల్లో జోక్యం చేసుకోరాదని వంటి పలు నిబంధనలను ఆ నియమావళిలో పొందుపరిచారు. రాజకీయాలంటే వ్యాపారం కాదని.. పేదల అభ్యున్నతి, సంక్షేమమే పరమావధి అని తెలుగుదేశం పార్టీ చాటింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని మలుపు తిప్పే ఎన్నో నిర్ణయాలకు టీడీపీ శ్రీకారం చుట్టింది. వాటిలో మచ్చుకు కొన్ని..
మహిళల కోసం ప్రత్యేకంగా తిరుపతిలో పద్మావతి మహిళా యూనివర్సిటీ ఏర్పాటు. తెలుగు భాషను ప్రోత్సహించేందుకు తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటు. దేశంలోనే తొలిసారిగా ప్రత్యేక వైద్య విశ్వవిద్యాలయం ఏర్పాటు. రాష్ట్రంలో ఉన్నత విద్యను అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు సార్వత్రిక విశ్వవిద్యాలయాన్ని బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీగా ఏర్పాటు చేసిన ఘనత టీడీపీ సొంతం.
మునసబు, కరణాల వ్యవస్థ.. పటేల్, పట్వారీ వ్యవస్థలను రద్దు చేసింది టీడీపీ ప్రభుత్వమే.
మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పిస్తూ చట్టం చేశారు. దేశంలో అలాంటి చట్టం చేసిన మొదటి రాష్ట్రం ఉమ్మడి ఏపీనే.





# టిడిపి సీనియర్ నేత మిద్దె చిన్న హుస్సేన్ కు అమరావతి రావాలని ముఖ్యమంత్రి పిలుపు.

**టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవం వేళ సీఎం నివాసంలో ప్రత్యేక భేటీ.**

**-పార్టీ కోసం శ్రమించిన 52 మంది సీనియర్లకు ఆహ్వానం - అందులో మిద్దె చిన్న హుస్సేన్ కు చోటు.**

**మంత్రి ఫరూక్ ఆశీస్సులతో దక్కిన గౌరవంపై హర్షం.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 28:**
తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని, పార్టీ అభివృద్ధి కోసం దశాబ్దాలుగా అహర్నిశలు కృషి చేసిన 52 మంది సీనియర్ నాయకులను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా గౌరవించనున్నారు. ఈ నెల 29వ తేదీన ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో జరిగే ఈ ప్రత్యేక కార్యక్రమానికి నంద్యాల జిల్లా నుంచి సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ మరియు మంత్రి ఫరూక్ గారి ముఖ్య అనుచరుడు మిద్దె చిన్న హుస్సేన్ కి ఆహ్వానం లభించింది.



రాష్ట్రవ్యాప్తంగా పార్టీ పటిష్టత కోసం పనిచేసిన నిబద్ధత గల నాయకులను గుర్తించిన అధిష్టానం, వారి సేవలను కొనియాడుతూ ఈ ఆహ్వానాన్ని పంపింది.
ఈ సందర్భంగా మిద్దె చిన్న హుస్సేన్ గారు మాట్లాడుతూ టీడీపీ పార్టీ స్థాపించిన నాటి నుండి నేటి వరకు తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, క్రమశిక్షణ గల కార్యకర్తగా పనిచేస్తున్నానని . గత ఐదేళ్ల ప్రతిపక్ష కాలంలో ఎన్నో ఒత్తిళ్లు ఎదురైనా, ప్రజా సమస్యల పై రాజీలేని పోరాటం చేశామన్నారు. నా కష్టాన్ని గుర్తించి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరియు మంత్రి ఎన్ఎండి ఫరూక్ నన్ను ఈ జాబితాలో ఎంపిక చేయడం చాలా సంతోషంగా ఉందని . ఈ గౌరవం నా బాధ్యతను మరింత పెంచిందన్నారు.
ఈ ఆహ్వానం పట్ల నంద్యాల జిల్లా తెలుగుదేశం శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. నియోజకవర్గంలో పార్టీ విజయానికి మరియు మంత్రి ఫరూక్ గెలుపులో చిన్న హుస్సేన్ గారు కీలక పాత్ర పోషించారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి

# తిమ్మాపురం మోడల్ స్కూల్లో..విద్య ద్వారా వినూత్న ఆవిష్కరణలు.

## -. తిమ్మాపురం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మణరావు.











**ఆంధ్ర ప్రగతి మహానంది మార్చి 28:**
విద్యార్థులు పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా, ప్రయోగాత్మక విద్య ద్వారా వినూత్న ఆవిష్కరణలు చేయాలని పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మణరావు పేర్కొన్నారు. శనివారం మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్ ఆధ్వర్యంలో మూడు రోజుల కమ్యూనిటీ అవుట్‌రీచ్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ లక్ష్మణరావు మాట్లాడుతూ...విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని, సృజనాత్మకతను పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారన్నారు. ల్యాబ్ ద్వారా విద్యార్థుల్లో పరిశోధనా శక్తి పెరుగుతుందని ఆయన ఆకాంక్షించారు. విద్యార్థులకు ఈ ప్రాజెక్టుల రూపకల్పనలో 'ఫా రోబోటిక్స్ లిమిటెడ్' నిపుణులు మెంటార్లుగా వ్యవహరించి, సాంకేతిక మెళకువలను నేర్పించారు. జెడ్పీ హైస్కూల్, కేజీబీవీ 100 మంది విద్యార్థులు పాల్గొని, తమ ప్రతిభతో 10 వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించారు. అనంతరం విజేతలకు ప్రిన్సిపాల్ చేతుల మీదుగా మొమెంటోలు, మెడల్స్,ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ పీర్ బాషా, సైన్స్ ఉపాధ్యాయులు ఆసిఫా పాల్గొన్నారు.

# ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి.

## ..అడ్మిషన్లు ప్రారంభమంటూ నగరంలో ఏర్పాటు చేసిన ప్రచార ఫ్లెక్సీలను తొలగించాలి.

## పి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎండి రఫీ డిమాండ్

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 28:**
నంద్యాల జిల్లా వ్యాప్తంగా అక్రమంగా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎండి రఫీ డిమాండ్ చేశారు. శనివారం నాడు సాయిబాబా నగర్ లో ఉన్న పి డి ఎస్ యు కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎండి రఫీ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్త ఉన్న కార్పొరేట్ విద్యా సంస్థలైన మరియు కొన్ని ప్రైవేటు విద్యా సంస్థలు 2026 -27 విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ముందస్తు అడ్మిషన్లు ప్రారంభించారని అన్నారు. కార్పొరేట్ సంస్థల వారు బహిరంగంగా కరపత్రాలు, ఫ్లెక్సీలు వేసి అడ్మిషన్ల కొరకు ఎలక్షన్ ప్రచారం రీతిలో కార్పొరేట్ విద్యా సంస్థలు ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ది ఢిల్లీ పబ్లిక్ స్కూల్, దిక్రీడో ఇంటర్నేషనల్ ఒలంపియాడ్




,ఇంటర్నేషనల్ స్కూల్, అని ప్రచారం నిర్వహిస్తూ ఐఐటి త్రిబుల్ ఐటీ ఫౌండేషన్ లాంటి కోర్సులు ఎల్కేజీ నుండే ప్రారంభిస్తున్నామని తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి ప్రజలను దోచుకుంటున్నారని విమర్శించారు. ఆర్థికమే ధ్యేయంగా పుట్టగొడుగుల పుట్టుకొస్తున్నటువంటి ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు రాష్ట్ర వ్యాప్తంగా సరైనటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వహించి,చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. కార్పొరేట్ ప్రైవేట్ విద్యా సంస్థ యాజమాన్యాలు ముందస్తు అడ్మిషన్ల పేర్లతో పిఆర్ఓ లను ,ఉపాధ్యాయులను ఏర్పాటు చేసి ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యా సంవత్సరం ఇంకా ప్రారంభం కాకముందే ముందస్తు అక్రమ అడ్మిషన్ ఫీజులతో పాటు,స్పెషల్ ఫీజు,పుస్తకాల ఫీజులని విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే రాష్ట్ర వ్యాప్తంగా అక్రమంగా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న పాఠశాలలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో పి.డి.ఎస్.యు ఆధ్వర్యంలో పాఠశాలలో ఉధృతమైన ఆందోళన నిర్వహిస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు జిల్లా ఉపాధ్యక్షులు షైక్.షాహీద్, జిల్లా నాయకులుమధుకిరణ్,బాలాజీ,వినోద్,కిరణ్,నాయక్,రవి తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి వాతావరణ కాలుష్యాన్ని నివారించాలి.

**డోన్ ఆర్డిఓ కె పి. నరసింహులు.**

**డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్.**

**సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి.**




**ఆంధ్ర ప్రగతి డోన్ మార్చి 28:** స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర లో భాగంగా మార్చి నెల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా నేడు "జీరో వేస్ట్ లిట్టర్ గవర్నెన్స్" కార్యక్రమం పై కార్యాలయాల పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టబడ్డాయి. తడి చెత్త పొడి చెత్త వేరు చేయడం, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా జాగ్రత్తలు, కార్యాలయాలు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచుట, సంపూర్ణ పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించి మున్సిపల్ ఆఫీసు నుండి పాతబస్టాండ్ వరకు ర్యాలి చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా డోన్ ఆర్డిఓ కె పి. నరసింహులు పాల్గొన్నారు. పాతబస్టాండ్ లో మానవహారం నిర్వహించి స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ ప్రతిజ్ఞ చేశారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు జీరో వేస్ట్ లిట్టర్ గవర్నెన్స్ అనేది చెత్తను మూలం వద్దే వేరు చేయడం తిరిగి ఉపయోగించడం మరియు ప్లాస్టిక్ రహిత పర్యావరణాన్ని ప్రోత్సహించడం ద్వారా చెత్తను భూమిలో చేరకుండా చూసే విధానం. ఇది 100% వ్యర్థాల నిర్వహణ, స్వచ్ఛ ఆంధ్ర వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలను భాగస్వాములను చేస్తూ పర్యావరణ పరిరక్షణకు, సుస్థిరమైన పరిశుభ్రతకు తోడ్పడుతుందని తెలిపారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన "స్వచ్ఛఆంధ్ర-స్వచ్ఛదివాస్" పై అవగాహన కల్పించారు. పట్టణంలోని పాతబస్టాండ్ లో డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో డోన్ ఆర్డిఓ కె పి. నరసింహులు, డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్, ,సామాజిక కార్యకర్త పి.మహమ్మద్ రఫి మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు సమాజ పరిసరాల పరిశుభ్రత వల్ల కలిగే ప్రయోజనాలు ప్రజలకు తెలిపారు. అపరిశుభ్రత వల్ల వాయు కాలుష్యం మరియు గుండె,రక్త ప్రసరణ వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతుంది. అలాగే పట్టణంలో పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరు వ్యక్తిగత శుభ్రతతో పాటు, మన ఇంటి చుట్టూ పరిసరాల పరిశుభ్రత స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మొదలుపెట్టాలని వారు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజలందరు ఆరోగ్యం,కాలుష్యం పై అవగాహన కలిగి ఉండాలని వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరు పాటించాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల దోమలు వృద్ధి చెందకుండా దోమకాటు నుంచి వచ్చేవిష జ్వరాల నుంచి కాపాడుకోవచ్చని తెలియజేశారు. వాతావరణ కాలుష్యాన్ని నివారించడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములై గాలిలో ఆక్సిజన్ శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలి. వాతావరణ కాలుష్యానికి హానికరమైన ప్లాస్టిక్ నిరోధించాలి. ప్లాస్టిక్ ని వాడకుండా మన ఆరోగ్యాలు మనమే కాపాడుకోవాలి. విరివిగా మొక్కలు నాటి మహావృక్షాలుగా తయారు చేసి వాతావరణ కాలుష్యాన్ని నివారించి ఓజోన్ పరిరక్షణ - ఓజోన్ పొరను రక్షించుకోవాలని తెలిపారు.నీటిని వృధా చేయకుండ జలసంక్షోభాన్నిఅరికట్టాలని డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్ ,సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సెక్రెటరిలు, సిబ్బంది మరియు స్వయం సహాయక బృందాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.